విద్యా ప్రయాణం సాగేదెలా..?

- గ్రామీణ విద్యార్థులకు బస్ పాస్‌లో మెలిక
- నిర్ణీత దూరం దాటగానే పూర్తిస్థాయి టికెట్ ధర
- రాయితీ టికెట్ తీసుకుంటే చెల్లదంటున్న కండక్టర్లు
- ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్న బాలికలు



కదిరి అర్బన్: గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువులకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచిత, రాయితీ ఆర్టీసీ బస్‌పాసులు మంజూరు చేస్తోంది. అయితే సదరు పాసులను నిర్ణీత కిలోమీటర్ల వరకు అనుమతిస్తున్నారు. తదుపరి రెండు లేదా మూడు కిలోమీటర్ల దూరం ఉంటే పాస్ చెల్లదంటూ కండక్టర్లు తిరస్కరిస్తున్నారు. దీంతో విద్యార్థులు డబ్బు పెట్టి టికెట్ తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి సుదూరంలోని కదిరి ప్రాంతంలో ఉన్న పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలంటే ఆర్టీసీ బస్సులపై ఆధారపడుతున్నారు. రోజూ ప్రయాణం చేసి విద్యాలయాలకు వెళ్లాలంటే డబ్బుతో కూడుకున్న వ్యవహారం. గ్రామీణ ప్రాంత పిల్లల చదువులకు ఇబ్బందులు రాకూడదనే ఉద్దేశంతో 12 ఏళ్లలోపు బాలలు, 18 ఏళ్లలోపు బాలికలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసేందుకు వీలుగా పాస్‌లు మంజూరు చేస్తున్నారు. బాలికలు ఈ ఉచిత పాసులతో ఇంటర్మీడియెట్ విద్య వరకు పట్టణ ప్రాంతానికి బస్సులో వెళ్లి చదువుకునే వీలుంది. కదిరి ఆర్టీసీ డిపో నుంచి 1,339 ఉచిత బస్ పాసులను ప్రభుత్వం మంజూరు చేసింది. డిపో నుంచి 20 కిలోమీటర్ల పరిధి వరకు ఉచిత ప్రయాణం చేయవచ్చు. అది కూడా పల్లె వెలుగు బస్సు సర్వీసుల్లో మాత్రమే. కదిరి నుంచి 48 పల్లె వెలుగు సర్వీసుల్లో రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. 20 కి.మీకి పైబడి దూరం నుంచి వచ్చే విద్యార్థులకు ఉచిత ప్రయాణానికి కండక్టర్లు అనుమతించడం లేదు. నిర్దేశిత దూరం వరకే అనుమతిస్తామని చెబుతున్నారు. మిగిలిన దూర ప్రయాణానికి టికెట్ తీసుకోవాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు. దీంతో సదరు గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉచిత పాసుకు అదనంగా డబ్బు చెల్లించి రాయితీపై మరొక పాసు తీసుకుంటున్నారు. దీన్ని 20 కిలోమీటర్ల వరకు ఉచిత పాసు, తర్వాత ఉన్న దూరానికి సంబంధించి రాయితీ పాసు చూపించి ప్రయాణం చేద్దామనుకుంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండింటిలో ఒక పాసు మాత్రమే చెల్లుతుందని కండక్టర్లు స్పష్టం చేస్తున్నారు. కూలీనాలీ చేసుకుని జీవనం సాగించే తమ తల్లిదండ్రులు అతి కష్టం మీద తమను చదువుకోవడానికి పంపిస్తున్నారని, ఇప్పుడు పూర్తి టికెట్ ధర చెల్లించి ప్రయాణం చేయాలంటే ఎలా అని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కష్టాలను, ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని తమ చదువులు కొనసాగేలా ఉచిత ప్రయాణానికి అనుమతించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

విద్యార్థులకు న్యాయం చేయండి



విద్యార్థులకు ఉచిత బస్సు పాసు ఎన్ని కిలోమీటర్లు చెల్లుతుందో అంతవరకు అనుమతించాలి. మిగిలిన దూరం వరకు డబ్బులు చెల్లించి తీసుకున్న రాయితీ పాసుకు అనుమతించాలి. అయితే చాలామంది కండక్టర్లు రెండు పాసులు చెల్లవంటూ విద్యార్థులకు పూర్తిస్థాయి టికెట్ ధర తీసుకుంటున్నారు. ఇది అన్యాయం. దీనిపై ఆర్టీసీ ఉన్నతాధికారులు ఆలోచించి విద్యార్థులకు న్యాయం చేయాలి.

– బాబ్జాన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

రెండు పాసులు చెల్లవు

ఆర్టీసీలో రెండు రకాల బస్ పాసులు చెల్లవు. ఏదో ఒకటి మాత్రమే చెల్లుతుంది. రెండు పాసులు జారీ చేయరు. దూర ప్రాంతంలోని వారు నెలవారీ సీజనల్ టికెట్ కూడా తీసుకోవచ్చు. 20 రోజుల టికెట్ ధర చెల్లిస్తే 30 రోజులు బస్సులో ప్రయాణించవచ్చు.

– హరిత, అసిస్టెంట్ డీఎం, కదిరి

క్లుప్తంగా

అబాకస్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ



అవార్డులతో విద్యార్థులు, నిర్వాహకురాలు

కదిరి టౌన్: సిప్ అబాకస్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలోని అయానా కన్వెన్షన్‌హాలులో రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలు నిర్వహించారు. 950 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కదిరికి చెందిన 15 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచారు. అందులో మూడో స్థాయి నుంచి ఎస్.పూజ చాంపియన్‌గా నిలువగా, రెండవ స్థాయి నుంచి పి.దీక్షిత, మూడవ స్థాయి నుంచి ఆర్.అర్చన ఫస్ట్ ప్రైజ్, ఆరో స్థాయి నుంచి బి.భవిష్య రెండవ ప్రైజ్ సాధించారు. మిగిలిన 10 మంది విద్యార్థులు బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డులు పొందారు. గెలుపొందిన విద్యార్థులందరికీ కదిరి సిప్ అబాకస్ నిర్వాహకురాలు మాధవి కేదార్‌నాథ్ అభినందనలు తెలియజేశారు.

రూ.20 వేల విరాళం



విరాళం అందజేస్తున్న డాక్టర్ బత్తల రాంప్రసాద్

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లిలో కొండ కింద ఉన్న ఆంజనేయస్వామి ఆలయానికి మెట్ల ఏర్పాటుకు రూ.20 వేల విరాళాన్ని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తల హరిప్రసాద్ అందజేశారు. ఈ మొత్తాన్ని ఆయన సోదరుడు డాక్టర్ బత్తల రాంప్రసాద్ చేతుల మీదుగా గుడి కమిటీ సభ్యులు ఉలగన్నరావ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ముబారక్, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

నల్లచెరువు: మండలంలో ప్రసిద్ధి చెందిన పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో ఆగస్టు పదో తేదీన ప్రారంభమయ్యే శ్రావణమాస మహోత్సవాల ఏర్పాట్లను ఆలయ ఈఓ రవీంద్రరాజు, ఎస్‌ఐ లింగన్న సోమవారం పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా క్యూలైన్ల ఏర్పాటు, తాగునీరు, షామియానా, ఆలయ ప్రాంగణంలో దుకాణాలు, ద్విచక్ర వాహనాలు, కార్ల పార్కింగ్ ఏర్పాట్లు చేపట్టాలన్నారు.

అల్పాహారం అందజేత

కదిరి అర్బన్: బూరుగుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం రిటైర్డ్ ఆర్టీసీ అసిస్టెంట్ డిపో మేనేజర్ హరిమోహన్ దంపతులు కేసరీబాత్, అరటిపండ్లు అందజేశారు. శుభ దిన్ తిథి భోజన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఈ అల్పాహారం పంపిణీ చేశారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రామాపురం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో టీచర్లు, గ్రామస్తులు

బత్తలపల్లి: విశాఖలో సెప్టెంబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రామాపురం ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఆదివారం అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ సెలెక్షన్ బాలికల సబ్ జూనియర్స్ విభాగంలో చరిత, జూనియర్స్ బాలికల బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో చందన, బాలుర విభాగంలో ఇబ్రహీం ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికై విద్యార్థులను ఎంఈఓ సుధాకర్ నాయక్, గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ధర్మవరంలోనే లేబర్ ఆఫీస్ ఏర్పాటు చేయాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ధర్మవరం: ధర్మవరంలోనే లేబర్ ఆఫీస్ ఏర్పాటు చేయించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డికి వినతిపత్రం అందించారు. సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో కన్వీనర్ ఆయుబ్‌ఖాన్, ఎల్.ఆదినారాయణ, ఎస్‌హెచ్ బాషా మాట్లాడుతూ గతంలో ధర్మవరంలో లేబర్ ఆఫీస్ ఉండేదన్నారు. సత్యసాయి జిల్లా ఏర్పడిన అనంతరం కొత్తచెరువుకు లేబర్ ఆఫీస్ తరలించారని తెలిపారు. ధర్మవరం పట్టణంతోపాటు బత్తలపల్లి, తాడిమర్రి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన కార్మికులకు ఏ చిన్న సమస్య వచ్చినా ధర్మవరంలోని లేబర్ ఆఫీస్ ఎంతో ఉపయోగపడేదని వివరించారు. ప్రస్తుతం కొత్తచెరువుకు మార్చడంతో కార్మికులకు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోయారు.

ప్రథమ చికిత్స కేంద్రాల తనిఖీ

నల్లమాడ: నల్లమాడ, రెడ్డిపల్లిలోని ప్రథమ చికిత్స కేంద్రాలను సోమవారం ధర్మవరం డివిజన్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సునీల్, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ దీప్తి తనిఖీ చేశారు. ఆర్‌ఎంపీల రిజిస్ట్రేషన్, అర్హత సర్టిఫికెట్లను పరిశీలించి, పలు సూచనలు, సలహాలిచ్చారు. సీహెచ్ఓలు రామాంజులు, నగేష్, హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్ర, సుశీలమ్మ, సూపర్‌వైజర్ మహబూబ్‌బాషా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థలం కేటాయించండి

ముదిగుబ్బ: అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకునేందుకు స్థలం కేటాయించాలని దొరిగిల్లు ఎస్సీ కాలనీ వాసులు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ పెద్దల సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటున్నట్లు కాలనీ తెలిపారు.

టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో 'బెస్ట్' విద్యార్థి సత్తా



టాప్ స్కోరర్ మనోజ్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: ఈ నెల 27, 28 తేదీల్లో పాండిచ్చేరిలో జరిగిన సౌత్‌జోన్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో గోరంట్ల సమీపంలోని బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ బీఎస్సీ ఫారెస్ట్రీ విద్యార్థి మనోజ్‌కుమార్ సత్తా చాటి టాప్ స్కోరర్‌గా నిలిచారు. కర్ణాటక బ్లూ టీం తరఫున ఆడిన మనోజ్ కుమార్ 22 బంతుల్లో 31 రన్నులు చేశారు. సోమవారం ఆ విద్యార్థిని యూనివర్సిటీ యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో వైస్‌చాన్సలర్ డాక్టర్ సుబ్రమణ్యం, పీడీ అసిస్టెంట్ ప్రొఫెసర్ శివ విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలి



అంగన్‌వాడీ కార్యకర్తను పరామర్శిస్తున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

కదిరి టౌన్: అంగన్‌వాడీలపై రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. వేధింపులు తాళలేక పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసి కదిరి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓడీసీ మండలం వీరప్పగారిపల్లి అంగన్‌వాడీ కార్యకర్త నాగమణిని ఆయన సోమవారం పరామర్శించారు. ఓబులు మాట్లాడుతూ ఆత్మహత్యాయత్నానికి కారకులైన టీడీపీ నాయకుడు ఆంజనేయులును తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారినపుడల్లా అంగన్‌వాడీ కార్యకర్తలను రాజకీయంగా వేధించడం, భయంభ్రాంతులకు గురిచేయడం సరైనది కాదన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే అండ చూసుకుని ఆంజనేయులు అంగన్‌వాడీ కార్యకర్తలపై వేధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. దాడికి గురైన అంగన్‌వాడీ కార్యకర్త నాగమణికి సానుభూతి తెలిపిన సుహాసిని, సునీతబాయిపై కూడా ఆంజనేయులు కుటుంబ సభ్యులు దాడికి పాల్పడటం హేయమైన చర్య అన్నారు. తక్షణమే నిందితులను అరెస్టు చేసి, దాడులు, వేధింపులు ఆపకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. పరామర్శించిన వారిలో యూనియన్ నాయకులు లక్ష్మీదేవి, భాగ్యమ్మ, సుజాత, వెంకటలక్ష్మి, సీఐటీయూ నాయకులు జీఎల్ నరసింహులు, జగన్ మోహన్, నారాయణ, బాబ్‌జాన్ తదితరులు ఉన్నారు.

దాతల సహకారం మరువలేనిది



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈఓ సుధాకర్‌నాయక్

బత్తలపల్లి: విద్యాభివృద్ధి దాతల సహకారం మరువలేనిదని మండల విద్యాశాఖ అధికారులు సుధాకర్ నాయక్, చాముండేశ్వరి అన్నారు. సోమవారం రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ స్థితి భోజన్ కార్యక్రమంలో భాగంగా సహపంక్తి భోజనాలు నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా గ్రామాల్లోని దాతల వివరాలను నమోదు చేసుకున్న ప్రకారం సహపంక్తి భోజనాలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు, ఉపాధ్యాయులు, దాత తరిగోపుల చౌదరి, ఆయా గ్రామాల్లోని ఉపాధ్యాయులు, దాతలు పాల్గొన్నారు.

తిథి భోజనానికి చేయూతనివ్వండి



స్వీట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

కనగానపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి సోమవారం ఏర్పాటు చేసే తిథి భోజనం కార్యక్రమానికి దాతలు చేయూత అందించాలని ఎంఈఓ అరుణమ్మ సూచించారు. సోమవారం కనగానపల్లిలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్థానిక సర్పంచ్ అంకె పరిమళ సహకారంతో విద్యార్థులకు తిథి భోజనం కింద స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కస్తూర్బా, మోడల్ స్కూల్, జెడ్పీ పాఠశాలల్లో జరిగిన తిథి భోజనం కార్యక్రమంలో ఎంఈఓలు అరుణమ్మ, శ్రీదేవి, ప్రధానోపాధ్యాయులు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'తిథి' భోజనం

గాండ్లపెంట: మలమీదపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పాఠశాల కమ్యూనిటీ సభ్యులు సోమవారం 'తిథి' భోజనాన్ని ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన తాయి నితిన్ భోజన సౌకర్యం కల్పించారు. అన్నదాతకు హెచ్ఎం హైదర్‌వలి, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన శిక్షా సప్తాహ్

ఎన్పీకుంట: శిక్షా సప్తాహ్ కార్యక్రమం సోమవారం ముగిసింది. చివరి రోజున మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు 'తిథి' భోజన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ ప్రత్యేక శిక్షణ



కోచ్‌లను సన్మానిస్తున్న ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

ధర్మవరం అర్బన్: ధర్మవరం బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు స్పెయిన్ బాస్కెట్‌బాల్ కోచ్‌లతో ఈ నెల 18 నుంచి ఇస్తున్న ప్రత్యేక శిక్షణ ముగిసిందని ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని బాస్కెట్‌బాల్ కోర్టులో సోమవారం స్పెయిన్ దేశానికి చెందిన కోచ్‌లు మార్, ఒరియోల్, నటాలియా, పోల్‌లను అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్డీటీ సహకారంతో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. క్రీడాకారులు అంతర్జాతీయస్థాయిలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్, ఆత్మీయ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన చల్లా ఓబుల నాయుడు, కరుణాకర్‌నాయుడు

బత్తలపల్లి: యర్రాయపల్లి బస్‌స్టాప్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లింగారెడ్డిపల్లికి చెందిన చల్లా ఓబులనాయుడు, కుమారుడు కరుణాకర్ నాయుడు ఇద్దరూ ద్విచక్ర వాహనంపై అనంతపురం వెళుతున్నారు. అదే సమయంలో బత్తలపల్లి నుంచి అనంతపురం వైపు కారు వస్తోంది. ఉన్నఫళంగా బైకు యర్రాయపల్లి క్రాస్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వస్తున్న తండ్రీకుమారుడు గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని అనంతపురంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

పేదలకు ఇంటి పట్టాలు ఇప్పిస్తాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

బత్తలపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా అసైన్డ్, పేదల భూములతో పాటు దేవుని మాన్యాలు కబ్జాకు గురవుతున్నాయని, వాటిని విడిపించి నిరుపేదలకు భూములు, ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బత్తలపల్లి సమీపంలోని నిడిమామిడి మఠం భూమిని సీపీఐ ఆధ్వర్యంలో భూ పోరాటంలో భాగంగా పేదలు గుడిసెలు వేసుకున్న స్థలాన్ని రామకృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, నియోజకవర్గ కార్యదర్శి మధు, చేనేత సంఘం రాష్ట్ర నాయకులు జింకా చలపతి పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ రూ.కోట్లు విలువ చేసే నిడిమామిడి మఠానికి చెందిన 19.84 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై పిత్రార్జితం కింద రికార్డుల్లో మార్పు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారన్నారు. ఇందుకు సహకరించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ రాష్ట్ర నాయకులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి నిడిమామిడి దేవదాయ భూమి సమస్యను వివరించి పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేలా చూస్తామని తెలిపారు. సీపీఐ చొరవతో గుడిసెలు వేసిన ఇళ్లులేని పేదలకు ఇంటిపట్టాలు ఇప్పిస్తామని, ఎవ్వరికీ రూపాయి కూడా ఇవ్వవద్దని ప్రజలకు సూచించారు.

ధర్మవరం ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్



రోగుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం అర్బన్: ధర్మవరం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని సోమవారం మంత్రి తనిఖీ చేశారు. ఓపీ విభాగం, క్యాజువాలిటీ వార్డులు, పోస్టుమార్టం బ్లాక్ తదితర వాటిని పరిశీలించారు. రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్యం ఎలా అందిస్తున్నారు.. తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గతంలో ఉన్న 50 పడకల సామర్థ్యాన్ని 100 పడకలకు పెంచి ఏరియా ఆస్పత్రిగా మార్చారన్నారు. కానీ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు లేవన్నారు. కొత్తగా నిర్మించిన మదర్ అండ్ చైల్డ్ ఆస్పత్రిలో కేవలం తల్లులు, పిల్లలకు వైద్యం అందించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఏరియా ఆసుపత్రిలో స్థలం ఎక్కువగా అందుబాటులో ఉండటంతో ప్రస్తుతమున్న భవనాలు కూలిపోయే స్థితిలో ఉన్నాయని, నూతన భవనాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించామని తెలిపారు. అనంతరం ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మంత్రి వెంట డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ చిలకం మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

మంత్రి గ్రీవెన్స్‌లో గందరగోళం

ధర్మవరం: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం సాయంత్రం మంత్రి సత్యకుమార్ గ్రీవెన్స్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమైన గ్రీవెన్స్‌లో మంత్రికి అర్జీలు ఇచ్చేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అయితే క్యూ పద్ధతిలో తీసుకునేలా ఎటువంటి ఏర్పాట్లూ చేయకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. తాగునీరు, డ్రైయినేజీ, నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు, వ్యక్తిగత, అనారోగ్య సమస్యలు తదితర వాటిపై వందల సంఖ్యలో అర్జీలు అందజేశారు.

రూ.20 వేలు వెంటనే జమ చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం, సీపీఐ నాయకులు

కనగానపల్లి: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వేరుశనగ సాగు చేయని రైతులకు ప్రభుత్వం ఉచితంగా చిరుధాన్యాల పంటల విత్తనాలు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మహదేవ డిమాండ్ చేశారు. సోమవారం మండల సీపీఐ, రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో రైతు సమస్యలపై తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఇంత వరకూ సరైన వర్షాలు కురవలేదన్నారు. మెట్ట పొలాల్లో చాలా మంది రైతులు ఇంకా వేరుశనగ సాగు చేయలేదని తెలిపారు. ప్రభుత్వం రైతులకు ఉచితంగా చిరు ధాన్యాలైన కొర్ర, జొన్న, పెసర, అలసంద వంటి విత్తనాలు అందిస్తే ఆలస్యంగా కురిసే వర్షాలకు పంటలు సాగుచేసుకుంటారన్నారు. అన్నదాత సుఖీభవ కింద ప్రభుత్వం ప్రకటించిన రూ.20 వేలను వెంటనే రైతులకు అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాలరాజు, నాయకులు మల్లికార్జున, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆర్డీటీ గృహాలు ప్రారంభం

ముదిగుబ్బ: నల్లచెర్లోపల్లిలో ఆర్డీటీ నిర్మించిన 17 గృహాలను సోమవారం స్పెయిన్ బృందం సభ్యులు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఆర్డీటీ హాబిటేట్ సెక్టార్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ హరి, ఏటీఎల్ కృష్ణ, రీజనల్ ఇంజినీర్ ఈశ్వరయ్య, ఆర్గనైజర్లు శ్రీరాములు, రమణ, అంజి, పర్వీన్, కళావతి, సీడీసీలు హేమావతి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

తలుపుల : తలుపులలోని ప్రకాష్‌నగర్‌లో ఆదివారం రాత్రి పక్కీరప్ప, వేమన్న వర్గీయులు ఘర్షణ పడ్డారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

నేడు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

తాడిమర్రి: మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో మంగళవారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు పశువైద్య శస్త్ర చికిత్స సహాయకురాలు స్వర్ణలత పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. పాడి పశువులు, సరిగా చూడు నిలవని పశువులు, ఎన్ని ఎద సూదులు వేసినా చూడి కట్టని పశువులకు గర్భకోశ పరీక్షలు చేసి తగిన సూచనలు, సలహాలు అందించడానికి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ పాల్గొంటారన్నారు.

ఉచిత గర్భ కోశ చికిత్సపై అవగాహన

ముదిగుబ్బ: పెయ్య దూడల పుట్టుకను ఉద్దేశించి లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేసే పథకంపై రైతులకు పశువర్ధక శాఖ అధికారులు అవగాహన కల్పించారు. జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నాగారెడ్డిపల్లిలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. డీఎల్‌డీఏ జిల్లా కార్యనిర్వహణాధికారి డాక్టర్ టి.వి.సుధాకర్, సహాయ సంచాలకులు డాక్టర్ వీరభద్రయ్య, చంద్రశేఖర్, పశువైద్యాధికారి రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మంజునాథ్, పశువైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ధర్మవరం రూరల్: ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్తున్న విద్యార్థిని వేముల నిఖితారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గొట్లూరు అనాథాశ్రమంలోని వృద్ధులు, అనాథలకు అన్నదానం చేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

ధర్మవరం రూరల్: మండలంలోని కుణుతూరు, సీతారాంపల్లి, చంద్రాశ్చర్ల తదితర గ్రామాల్లో సోమవారం ప్రబోధ సేవా సమితి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేశారు.

సీపీఎం మండల కార్యదర్శిగా పెద్దన్న

ముదిగుబ్బ: సీపీఎం మండల కార్యదర్శిగా ఆటో పెద్దన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం జరిగిన ఈ ఎన్నిక కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు జీఎల్ నరసింహులు హాజరయ్యారు.

చెరువు మట్టి అక్రమ రవాణాను అడ్డుకోవాలి

నల్లమాడ: మండలంలోని యర్రవంకపల్లి, రెడ్డిపల్లి, రెడ్డికుంట తండా చెరువుల నుంచి మట్టి అక్రమంగా తరలకుండా అడ్డుకోవాలని సర్పంచులు రజనీకాంత్ రెడ్డి, బొజ్జేనాయక్ అధికారులను కోరారు. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కోసం ఈ మట్టిని గ్రామ పంచాయతీల ఆమోదం లేకుండా తరలిస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. చెరువుల్లో జేసీబీ యంత్రాలతో పెద్ద పెద్ద గుంతలు తవ్వుతున్నారని, దీనివల్ల భూగర్భ జలాలు మరింత అడుగంటిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తపర్చారు.

సహకరించిన వారందరికీ ధన్యవాదాలు



బత్తలపల్లి తహసీల్దార్‌ను సన్మానిస్తున్న దృశ్యం





తలుపుల తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది , గాండ్లపెంట తహసీల్దార్ శ్రావణితో సిబ్బంది

బత్తలపల్లి: విధి నిర్వహణలో తనకు సహకరించిన వారందరికీ తహసీల్దార్ శివశంకర్ నాయక్ ధన్యవాదాలు తెలియజేశారు. బదిలీపై సొంత జిల్లాకు వెళ్తున్న తహసీల్దార్‌కు కార్యాలయంలో సోమవారం కార్యాలయ సిబ్బంది సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో తనను ప్రభుత్వం ఇక్కడకి బదిలీ చేసిందన్నారు. ఎన్నికల అనంతరం స్వంత జిల్లాలకు అధికారులను బదిలీ చేయడంతో తాను కూడా కర్నూలు జిల్లాకు వెళుతున్నట్లు వివరించారు. తనకు సహకరించిన సిబ్బంది అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్వే తహసీల్దార్ సునీత, సీఎస్‌డీటీ శారద, సీనియర్ అసిస్టెంట్ విజిత, జూనియర్ అసిస్టెంట్ రామాంజినమ్మ, హరికృష్ణ, కంప్యూటర్ ఆపరేటర్ చక్రపాణి, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం.

తలుపుల : సార్వత్రిక ఎన్నికల సమయంలో తలుపులకు తహసీల్దార్‌గా వచ్చిన రామకుమారి తిరిగి సొంత జిల్లా వైఎస్సార్‌జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమెను కార్యాలయ సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ రామకుమారి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సహకరించిన రెవెన్యూ సిబ్బందికి, మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

గాండ్లపెంట తహసీల్దార్ బదిలీ

గాండ్లపెంట: తహసీల్దార్ శ్రావణి అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు. సోమవారం డిప్యూటీ తహసీల్దార్ రవి ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు.